ప్రజాశక్తి

శుక్రవారం 8 సెప్టెంబర్ 2023

8 పేజీలు

విశాఖపట్నం | అనకాపల్లి

బల్క్ ల్యాండ్ గుటకాయ స్వాహా !

- భూముల విక్రయానికి సిద్ధమైన వియంఆర్‌డిఎ
- ఎపిఐఐసి నుంచి పలు భూములు బదలాయింపు
- లూలూ 13.31 ఎకరాల అమ్మకానికి త్వరలో ధర నిర్ణయం
- మధురవాడ యాంబియన్స్ విక్రయానికి సిద్ధం
- రూ.1274 కోట్లకు అమ్మకం ప్రతిపాదన

గతంలో లూలూకు కేటాయించిన స్థలం (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఎపిఐఐసి నుంచి పలు భూములు (బల్క్ ల్యాండ్స్) వియంఆర్‌డిఎకు బదిలీ అవుతున్నాయి. కేవలం అమ్మకమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ భూములను బదిలీ చేస్తోంది. ఈ నేపథ్యంలో నగర పరిధిలోని మధురవాడ 421 సర్వే నెంబరు పరిధిలోగల 87 ఎకరాలను గతంలో యాంబియన్స్‌కు ఇవ్వగా, నేడు ఆ భూములను వియంఆర్‌డిఎ వెనక్కి తీసుకుని అమ్మకానికి పెట్టింది. ఇది కాకుండా ఎపిఐఐసికి చెందిన గతంలో లూలూకు చంద్రబాబు హయాంలో మాల్ కోసం కేటాయించిన 13.31 ఎకరాలను వియంఆర్‌డిఎ వేలం పాటకు పెట్టింది. ఇలా వియంఆర్‌డిఎకు సంబంధించిన భూములన్నింటినీ అమ్మకానికి పెట్టడం విశేషం.

యాంబియన్స్ ప్రాజెక్ట్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 2007లో మిగతా 2లో..

విద్యుత్ కోతలతో రైతుకు తిప్పలు

◆ బోర్ల కింద ఉడుపులు కాని దుస్థితి ◆ ఎండిపోతున్న వరి మడులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఎడాపెడా విద్యుత్ కోతలతో జిల్లాలో రైతన్నలకు అవస్థలు తప్పడం లేదు. గృహ, వ్యవసాయ వినియోగదారులకు అంతరాయం లేకుండా మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు పరిశ్రమల రోజువారీ విద్యుత్ వినియోగంలో కొన్ని నియంత్రణ చర్యలు తీసుకుంటున్నట్లు ఈ నెల 3న ఎపిఇపిడిసిఎల్ అధికారులు మీడియాకు ప్రకటన విడుదల చేసినా అంతకు చాలా రోజుల ముందు నుంచే రైతును విద్యుత్ సరఫరా కష్టాలు వెంటాడుతున్నాయి. వ్యవసాయ పంపుసెట్లకు 9 గంటలు నిరంతర విద్యుత్ సరఫరా లేక బోర్ల కింద సాగుచేస్తున్న రైతు తిప్పలు పడుతున్నాడు. విద్యుత్ సరఫరా సమస్య తరచూ వుండడంతో బోర్ల కింద వరి పంట సాగుచేయలేని పరిస్థితి నెలకొంది.

జిల్లాలోని 24 మండలాల్లో 41 వేలకు పైగా వ్యవసాయ బోర్లున్నాయి. జిల్లాలోని వరి సాధారణ సాగు విస్తీర్ణం 1.36 లక్షల ఎకరాల్లో 50 వేల ఎకరాల వరకు బోర్లు కింద సాగవుతున్నట్లు వ్యవసాయ మిగతా 2లో..

దమ్ముకు నీరులేక గడ్డితో ఉన్న తిమ్మరాజుపేట కౌలు రైతు వంగా అప్పారావు పొలం

మత్స్యకారులు సురక్షితం

వార్త 7లో..

నేడు ఆనందపురంలో 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమాన్ని శుక్రవారం ఆనందపురం మండలంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. ప్రతి సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు. దీన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మండల స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసిందని తెలిపారు. దీనిలో భాగంగా 8వ తేదీ నుంచి అక్టోబర్ 13వ తేదీ వరకూ బుధ, శుక్రవారం రోజుల్లో మండల కేంద్రాలలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కైలాసగిరిపై సైన్స్ మ్యూజియం ఏర్పాటుకు కృషి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కైలాసగిరిపై సైన్స్ మ్యూజియం ఏర్పాటుకు తాను కృషి చేస్తానని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. గురువారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖ, అనకాపల్లి జిల్లాల సారథుల సంయుక్త సౌజన్యంతో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మేయర్ మాట్లాడుతూ గురువులు ఎప్పుడూ పూజనీయులేనని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యతనిస్తోందన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను ఆమె సత్కరించారు.

అణుకు గ్రామం వద్దకు రేషన్

వార్త 8లో..

మొదటి పేజీ తరువాయి..

బల్క్ ల్యాండ్ గుటకాయ స్వాహా !

కేటాయించిన 87 ఎకరాలను వియంఆర్‌డిఎ ఏడు బిట్లుగా విభజించి చదరపు గజాన్ని రూ.30 వేలకు ఆక్షన్‌కు పెట్టింది. ఇది నగర పరిధిలోని అత్యంత ప్రైమ్ ల్యాండ్ అని, ప్రైవేట్ డవలపర్ చేతుల్లో పెట్టకూడదని గతంలోనే వాదనలు వినిపించిన విషయం తెలిసిందే. ఎకరాను అప్పట్లో రూ.2.14 కోట్లకు ఇచ్చేశారు. మొత్తం రూ.85 కోట్లకుగానూ ఈ ప్రైవేట్ ఏజెన్సీ రూ.76 కోట్లు చెల్లించేసింది. ఇక్కడ సరైన మౌలిక వసతులు కల్పించలేదని సదరు ప్రైవేట్ డవలపర్ యాంబియన్స్ అధినేత 2016 వరకూ వేచిచూసి వియంఆర్‌డిఎను 8 శాతం వడ్డీతో తన డబ్బు వెనక్కి ఇచ్చేయాలని ప్రతిపాదన చేయగా రాష్ట్ర ప్రభుత్వ అనుమతులతో దీన్ని చెల్లించడం జరిగింది. ఇలా వెనక్కి తీసుకోవడంతో తాజాగా రూ.1264 కోట్లకు మార్కెట్‌లో వేలానికి పెట్టడం వల్ల వియంఆర్‌డిఎకే లాభం అనే వాదనలు అధికారుల నుంచి తాజాగా వినిపించడం విశేషం.

లులూ కథ ఏమిటి ?

విశాఖలో గత టిడిపి హయాంలో లులూ సంస్థకు సుమారు 13 ఎకరాల మేర భూ కేటాయింపులను ఆర్‌కె బీచ్ ఎదురుగా చేసిన విషయం తెలిసిందే. విశ్వప్రియ ఫంక్షన్ హాల్‌లోగల 3.40 ఎకరాలూ దీనిలోని భాగమే. సరిగ్గా ఈ 3.40 ఎకరాల కోసం సిఎంఆర్ సంస్థకు ప్రత్యామ్నాయంగా ఆరు చోట్ల 1:1.5 నిష్పత్తిలో చంద్రబాబు ప్రభుత్వం వియంఆర్‌డిఎకుగల ఆరుచోట్ల ఉన్న 4.85 ఎకరాలను అప్పగించేసింది. ఆ తరువాత వైసిపి 2019లో అధికారంలోకి వచ్చాక ఈ కేటాయింపులు సరైనవి కావంటూ రద్దు చేసింది. దీంతో లులూ ఇక్కడ నుంచి తమిళనాడుకు వెళ్లిపోయింది. ఆ తర్వాత నడుస్తున్న కథ చూస్తే... తాజాగా ఎపిఐఐసి పరిధిలో ఉన్న ఈ భూములు వియంఆర్‌డిఎకు బదిలీ అయ్యాయి. ఎపిఐఐసి రాష్ట్ర మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ వ్యవహారం నడిచింది. అయితే సుమారు రూ.1200 కోట్లకు పైగా విలువ చేసే ఈ భూములకు వియంఆర్‌డిఎ చదరపు గజం ఎంత నిర్ణయిస్తుందన్నది చూడాల్సిందే. యాంబియన్స్ మాదిరిగా దీన్ని బిట్‌లుగా విభజించడానికి వీల్లేదు. బల్క్ ల్యాండ్‌గానే దీన్ని ఆక్షన్‌కు పెట్టనున్నట్లు వియంఆర్‌డిఎ అధికారులు చెబుతున్నారు. యాంబియన్స్ మాదిరిగా చదరపు గజం రూ.30 వేలు - రూ.1లక్షలోపు నిర్ణయించినా సరే ఈ భూములు చౌకగా ఏ రాజకీయ నాయకుడో, రాజకీయ వ్యాపారో కొట్టేస్తాడు. వాస్తవానికి ఇక్కడ చదరపు గజం రూ.2 లక్షలకుపైగా పలుకుతోంది.

విద్యుత్ కోతలతో రైతుకు తిప్పలు

ఎండిపోతున్న కౌలు రైతు రాము పొలం

శాఖ అంచనా. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులకు తోడు 9 గంటల నిరంతర విద్యుత్ సరఫరా లేకపోవడంతో బోర్లు కింద వరి సాగు రైతుకు కష్టంగా మారింది. తిమ్మరాజుపేట, మునగపాక, పెదపాడు, ఖాజీపాలెం తదితర ప్రాంతాల్లో బోర్ల కింద కొంతమంది రైతులు ఉడుపులు చేసుకోలేకపోగా, ఉడుపులైన పొలాలకు కరెంట్ కోతలతో మడుల నిండా నీరు పెట్టలేని పరిస్థితి నెలకొంది. వర్షాధార భూముల వలె బోర్ల కింద వరి పొలాలు ఎండిపోతున్నాయి. అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేటకు చెందిన కౌలు రైతు శరగడం రాము చింతచెట్టుదిబ్బ దరిలోని 70 సెంట్లులో బోరు కింద వరి పంట వేశాడు. విద్యుత్ సరఫరా మధ్యమధ్యలో నిలిచిపోవడంతో నీటితడి పెట్టలేని కారణంగా పంట ఇప్పుడు ఎండిపోతోంది. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఇస్తున్న విద్యుత్‌లో రెండు నుంచి నాలుగు సార్లు సరఫరా ఆగిపోవడంతో తడులు పెట్టలేకపోతున్నామని రైతులు 'ప్రజాశక్తి' వద్ద వాపోయారు. చింతచెట్టుదిబ్బదరిలోని రాము వరి పొలానికి పైభాగాన 40 సెంట్లు భూమిని వంగా అప్పారావు కౌలుకు తీసుకున్నాడు. బోరు నీరు కట్టుకొనే వరకు విద్యుత్ వుండకపోవడంతో దమ్ము చేయలేకపోయాడు. ఆకు ముదిరిపోయింది. విద్యుత్ సరఫరాలో వున్న ఇబ్బందులతో బోర్ల కింద వరి సాగు దాదాపు అన్ని ప్రాంతాల్లో ఇలాగేవుంది. అయితే ఇపిడిసిఎల్ అధికారులు మాత్రం సాంకేతిక సమస్యల సందర్భాల్లో మినహా మిగిలిన కాలమంతా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెబుతున్నారు.

ఆరు తడిపంటల వలే నీరు పెడుతున్నాం

రెండు మోటార్లు కింద ఐదెకరాల వరి సాగుచేస్తున్నాను. బోరు నీరు పెట్టలేక నాలుగు ఎకరాల్లో ఎద వేశాను. లో ఓల్టేజీ సమస్య లేనప్పటికీ 9 గంటల్లో నాలుగైదు సార్లు కరెంట్ పోవడంతో మడి నిండా నీరు పెట్టలేక ఆరుతడి పంటలకు తడి పెట్టినట్లు వరి పొలాలకు పెడుతున్నాను.

కర్రి నాగేశ్వరరావు, తిమ్మరాజుపేట, అచ్యుతాపురం మండలం

కరెంట్ కోతతో తడిసిన చేనే తడుస్తోంది

నాలుగు ఎకరాల్లో రెండెకరాల్లో వరి, రెండెకరాల్లో చెరుకు వేశాను. ఉదయం 4 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఇస్తున్న విద్యుత్‌లో మధ్యలో గంటకు మించి కరెంట్ తీస్తే, ఆ గంట కాలానికి కరెంట్ ఇస్తున్నారు. గంటలోపు ఎన్నిసార్లు తీసినా కరెంట్ ఇవ్వడంలేదు. కరెంట్ వచ్చిపోవడంతో తడిసిన చేను తడుస్తోంది.

ఆడారి అప్పారావు, మునగపాక

9 గంటలు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి

వ్యవసాయ పంపుసెట్లకు 9 గంటలు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి. అనధికార కోతలు నివారించాలి. కరెంట్ సరఫరాలో కోతలతో బోర్ల కింద ఉడుపులు కాలేదు. అనేక ప్రాంతాల్లో ఉడిసిన పొలాలు ఎండిపోతున్నాయి. వాస్తవ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని సాంకేతిక సమస్యలేకుండా 9 గంటలు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి.

కర్రి అప్పారావు,
ఎపి రైతు సంఘం అధ్యక్షులు, అనకాపల్లి జిల్లా

ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియ పరిశీలన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం అమలును విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గురువారం ఆయన జివిఎంసి జోన్ 5 పరిధిలో అల్లిపురం వెంకటేశ్వరమెట్ట-1 సచివాలయంలో ఇంటింటికీ ఓటరు సర్వే కార్యక్రమంలో భాగంగా తనిఖీలు నిర్వహించారు. ఓటరు నమోదుపై బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లు చేపడుతున్న చర్యల గురించి అడిగి తెలుసుకుని, పలు సూచనలు చేశారు. ఓటరు చేరికలు, తొలగింపులు, ఒకే డోర్ నెంబరులో పది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న ఇంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులను, వికలాంగులను, ట్రాన్స్‌జెండర్లను ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. ఫామ్ - 6 ద్వారా నూతన ఓటర్ల నమోదుకు, ఫామ్ 6(బి), ఫామ్ -7, ఫామ్ -8 ద్వారా ఓటర్ల జాబితా వివరాలలో మార్పులు, చేర్పులకు అవకాశం ఉందని తెలిపారు. పొరపాట్లకు తావీయకుండా పారదర్శకంగా అర్హులందరి ఓట్లు ఉండేలా జాగ్రత్త వహించాలన్నారు. నిబంధనల మేరకు ఓటర్ల మార్పులు, చేర్పులను సవరించి జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో ఆర్‌డిఓ హుస్సేన్ సాహెబ్, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జెసి విశ్వనాథన్

కేక్ కట్ చేస్తున్న అధికారులు

ఘనంగా బిఒఐ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బ్యాంక్ ఆఫ్ ఇండియా 118వ వ్యవస్థాపక దినోత్సవాన్ని విశాఖలో ఘనంగా నిర్వహించారు. జోనల్ మేనేజర్ కె.శ్రీనివాస్, డిప్యూటీ జోనల్ మేనేజర్ ఎన్.జేజేశ్వరరావు, హెచ్‌ఆర్ అండ్ చీఫ్ మేనేజర్ జి.శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బ్యాంకు పురోగతిని వివరించారు. సంస్థ ఆర్థికాభివృద్ధికి ఖాతాదారులు, వాటాదారులు వెన్నుదన్నుగా నిలిచారన్నారు. వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

బిసిలకు న్యాయం చేస్తాం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బిసిలకు న్యాయం చేస్తామని రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు అన్నారు. ఉత్తరాంధ్ర బిసిల సామాజిక సాధికారత సదస్సు గురువారం నగరంలోని ఓ ప్రముఖ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సొండి కుల సంఘం అధ్యక్షులు రత్నాల కాశీ విశ్వనాథ చౌదరి, నవ్యాంధ్ర సొండి కుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.కోటేశ్వరరావు, బి.రవిచంద్ర, ఆర్.దేవరాజు, కళింగ వైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు పట్నాల శ్రీనివాస్, జోనల్ ఇన్‌ఛార్జి వడ్డీ నాగరాజు పాల్గొన్నారు.

జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ నగరంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు, డెస్క్ జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పలువురు సీనియర్ జర్నలిస్టులు కోరారు. గురువారం సాయంత్రం జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధన కోసం జివిఎంసి సెల్లార్‌లో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి జర్నలిస్టుకు మూడు సెంట్లు స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు జిల్లా కలెక్టర్ సుముఖంగా ఉన్నారని, ప్రభుత్వం నుంచి ఆమోదం రావాల్సి ఉందని తెలిపారు. సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు ఆర్.రామచంద్రరావు, బి.రవి కాంత్, పి.రామకృష్ణ, రాఘవేందర్ రెడ్డి, పి.సత్యనారాయణ, జి.జనార్దనరావు, డి.రవికుమార్, బి.శివప్రసాద్ పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన జర్నలిస్టులు

సుబ్బారెడ్డిని కలిసిన ముస్లిం పెద్దలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పలు సమస్యలపై రైల్వే న్యూ కాలనీలోగల మస్జిద్ - ఎ - హుదా కార్యనిర్వాహక కమిటీ సభ్యులు సయ్యద్ హబీబ్ పాషా తదితరులు గురువారం వైసిపి రీజనల్ కో - ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని కలిశారు. తమ మసీదు వద్ద ట్రాఫిక్ సమస్యను వివరించి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, భీమిలి శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైసిపి జిల్లా అధ్యక్షులు డిసిసిబి చైర్మన్ కోలా గురువులు, రాష్ట్ర మైనారిటీ విభాగం ప్రధాన కార్యదర్శి ఐహెచ్.ఫారుఖి, కార్పొరేటర్ బర్కత్ అలీ పాల్గొన్నారు.

డబ్ల్యుడి బ్లూ ఎస్ఎన్ 580 ఎన్‌విఎంఇ ఆవిష్కరణ

కలెక్టరేట్ : విజువల్ బ్రిలియెన్స్, డిజిటల్ కంటెంట్ క్రియేషన్‌కు రోజురోజుకూ డిమాండ్ పెరుగుతోందని, అందుకు తగ్గట్టు సృజనాత్మక నిపుణుల కోసం వెస్ట్రన్ డిజిటల్ డబ్ల్యుడి బ్లూ ఎస్ఎన్ 580 ఎన్‌విఎంఇ ఎస్-ఎస్‌డిని పరిచయం చేస్తున్నట్లు వెస్ట్రన్ డిజిటల్ సీనియర్ డైరెక్టర్ సేల్స్ ఖలీద్ వానీ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

IN THE COURT OF THE 6TH ADDL. DISTRICT JUDGE, KAKINADA (MACT)
M.V.O.P. No. 165 / 2019
Between:
Vahinipathi Ramarao ...Petitioner
and
Mylapalli Lokesh and another ..Respondents
Respondent:
R2: M/s. Janaki Travels
Prop. **Janaki Satyanarayana**, D.No.15-3-24/2, Ground Floor, 7 Padminivilla, Near Century Club, Maharanipeta, Visakhapatnam.
పై నెంబరు పిటీషన్‌లో 2వ రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టువారు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది.**05-10-2023** తేదీకి వాయిదా వేసియున్నారు. కావున మీరు ఆరోజు ఉదయం **10.30** ని॥లకు మీరు పై కోర్టువారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల పై పిటిషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.
(కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
G.V.S. VINAYAKA RAO
Advocate, D.No.10-4-30, Seshagiri Rao Street, Ramaraopet, Kakinada
Cell: 98484479893

Court Noitce
IN THE HONORABLE SENIOR CIVIL JUDGE COURT AT VIZIANAGARAM
FDIA. NO. 4/2021 IN O.S. 409/2016
Between:
Uligundam Sanyasi Rao .....petitioner/plaintiff.
And:
Uligundam Venkata Subba Lakshmi (died) and 4 others.....Respondents/defendants.
To,
Respondents.
2. Uligundam Venkata Kanaka Satya Subramanyam S/o late Bemakrishna Rao, aged about 47 years R/o Athava village, Vepada mandal, Vizianagaram dist.,
3. Mirimanda Venkata Krishna Kumari, W/o Sitharamayya, Aged about 45 years, R/o Boruvanipalem Chinagdhili Mandal, Visakhapatnam district
4. Datala Venkata Ramanamma W/o Chandra Raju aged, about 57 years R/o D.No. 1-118, Chinamusidiwada village Pendurthy Mandal, Visakhapatnam district
5. Pericharla Venkata Narayana Raju S/o Suryanarayana Raju aged, about 45 years R/o D.No. 1-118, Chinamusidiwada village Pendurthy Mandal, Visakhapatnam district
Please take notice above named petitioner /plaintiff filed the above petition against you and posted for your appearance on **22-09-2023 at 10-30 AM.** On that day you are personally or through Advocate attend before this honorable court at 10-30 AM, failing which the matter will be decided in your absence and pass ex-parte orders as per Law
// BY ORDER //
K.H.RAJA RAO. M.Com B.Ed., B.L.
ADVOCATE, KOTHAVALASA
VIZIANAGARAM DIST.,
Ph.9885986989.

సమస్యలపై కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కరించాలని, అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మకు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు గురువారం వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాలుర గృహంలో వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఆరిలోవ : దీనదయాల్‌పురంలోని ప్రభుత్వ బాలుర ప్రత్యేక గృహంలో కెజిహెచ్ వైద్య బృందం ఆధ్వర్యాన గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. 50 మంది బాలురకు ఎస్‌టిఐ, టిబి, హెచ్‌ఐవి, ఆర్‌పిఆర్, హెచ్‌బివి వంటి పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో గృహం పర్యవేక్షణాధికారి వీరయ్య, కౌన్సిలర్ సూర్యారావు, ల్యాబ్ టెక్నీషియన్ ఎల్.తిరుమలరావు, ఐ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కురిసిన వర్షం.. అన్నదాత హర్షం...

పలు చోట్ల ఉడుపులుకు సిద్ధమవుతున్న రైతులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : డివిజన్ పరిధిలో ప్రస్తుతం కురిసిన వర్షంతో రైతాంగంలో ఒకింత ఆనందం వెల్లివిరుస్తోంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు అనుకూలమైన వాతావరణం లేక భీమిలి మండలం కాపులుప్పాడ, సింగనబంద, మజ్జివలస, మజ్జిపేట, ఆనందపురం మండలం గిడిజాల, తర్లువాడ, గొట్టిపల్లి, పద్మనాభం మండలం బిఆర్.తాళ్లవలస, ఐనాడ, రేవిడి తదితర గ్రామాల్లో ఇప్పటి వరకూ ఉడుపులు పడని పరిస్థితి ఉంది. ఆయా గ్రామాల్లో వేసిన నార్లు 45 నుంచి 50 రోజుల వయసులో ఉన్నాయి. ప్రస్తుతం కురిసిన వర్షాలకు పూర్తి స్థాయిలో ఉడుపులు చేసేందుకు రైతాంగం సమాయత్తం అవుతోంది.

టి.నగరపాలెంలో సాగులో వరి

భీమిలి మండలంలో వరి పంట సాధారణ విస్తీర్ణం 1326 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు సుమారు 500 ఎకరాల్లో వరి నాట్లు వేశారు. ఆనందపురం మండలంలో వరి పంట సాధారణ విస్తీర్ణం 1563 ఎకరాలు కాగా సుమారు 870 ఎకరాల్లో వరి నాట్లు వేశారు. పద్మనాభం మండలంలో వరి పంట సాధారణ విస్తీర్ణం 6,229 ఎకరాలు కాగా సుమారు 5300 ఎకరాల్లో వరి నాట్లు వేశారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-యంత్రాంగం

కృష్ణాష్టమి వేడుకలు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో అలరించారు. పలు గ్రామాల్లో అన్నసమారాధన కార్యక్రమాలు చేపట్టారు.

ఆనందపురం : ఆనందపురం మండలం వెల్లంకిలోని రవీంద్ర భారతి పాఠశాలలో కృష్ణుడు, గోపికల వేషధారణలతో విద్యార్థులు సందడి చేశారు. పాఠశాలలో ఉట్టిని కొట్టేందుకు చిన్నారులు పోటీపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎన్.వెంకటేష్, ప్రిన్సిపల్ మంగలక్ష్మి, ఎజిఎంలు ఉమామహేశ్వరరావు, రమణ పాల్గొన్నారు.

పెందుర్తి : కృష్ణాష్టమి సందర్భంగా రాంపురంలోని శ్రీకృష్ణ ఆలయాన్ని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శిరీష, అన్నంరెడ్డి శ్రీరాములు, బాదిరెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : మల్కాపురంలో శ్రీ విజ్ఞాన్ మండల యాదవ సంఘం ఆధ్వర్యాన కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, పశ్చిమ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు పుర్రె పూర్ణశ్రీసురేష్ యాదవ్, గుండపు నాగేశ్వరరావు, కొణతాల సుధ, నాయకులు బొమ్మిడి రమణ, ఊరుకోటి చందు, కలిదిండి బద్రీనాథ్, ఉరుకోట అప్పారావు, నక్క లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురంలో శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహం ఊరేగింపు

గాజువాక : 75వ వార్డు పరిధి ముసలినాయుడుపాలెంలో ఏర్పాటుచేసిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో టిడిపి నాయకులు పల్లా శ్రీనివాసరావు, వైసిపి గాజువాక ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి, జనసేన నాయకుడు కోన తాతారావు, వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావు, 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు హాజరై పూజలు నిర్వహించారు.

గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు పరిధి నందమూరినగర్ ఉమారామలింగేశ్వర ఆలయంలో శ్రీకృష్ణ యాదవ యువజన సేవా సంఘం ఆధ్వర్యాన శ్రీకృష్ణాష్టమి నిర్వహించారు. జివిఎంసి కో-ఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జి.అప్పలస్వామి నాయుడు, కంపర సత్తిబాబు, ధవళ మోహన్, నమ్మి రమణ, శిలీల గోపాల్, సూరిబాబు, నమ్మి సత్తిబాబు పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు పరిధి సీతమ్మపేట జంక్షన్‌లో యశోదకృష్ణ సేవాసంఘం ఆధ్వర్యాన నిర్వహించిన పూజా కార్యక్రమాలలో మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఉత్తర వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ పాల్గొని పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముద్దాడ యల్లాజీ, ముద్దాడ శంకర్, బీసపు శ్రీను, ఒమ్మి ఆనంద్, పల్ల గోవిందనాయుడు, బి.గోవింద్ పాల్గొన్నారు.

సింహాచలం: కృష్ణాపురం నూతన గోశాలలో కృష్ణుని విగ్రహం వద్ద వేడుకలు వైభవంగా నిర్వహించారు. సింహాచలం మురళీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఉత్సవాలను నిర్వహించారు. గాలిగోపురం ఎదురుగా ఉట్ల సంబరాన్ని నిర్వహించారు.

నక్కపల్లి : ఉపమాక వెంకన్న ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలను ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, అర్చకులు భాగవతం గోపాల ఆచార్యులు బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. పలురకాల పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు. శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామిఉత్సవమూర్తులను తిరువీధి నిర్వహించి, అనంతరం ఉట్ల పండుగ నిర్వహించారు. అర్చకులు కృష్ణమాచార్యులు, పీసపాటి వెంకట శేషాచార్యులు, నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాసులు, ఇల్లింద వెంకట గోపాలాచార్యులు, సందూరి వెంకట అప్పల రంగాచార్యులు దేవస్థానం సిబ్బంది గురవయ్య, గ్రామస్తులు ఎన్ వి రాజగోపాల్ ఆచార్యులు, సింగరాచార్యులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా కొనవానిపాలెం, కొత్త పోలవరం, రాయవరంలో వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉట్టి కొట్టే వేడుక నిర్వహించారు. ధర్మవరం అగ్రహారంలో అన్నసమారాధన, కోలాటాలు నిర్వహించారు. రాయవరం వినయ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థుల వేషధారణలు అలరించాయి. బత్తుల వాసుపాల్గొన్నారు.

యలమంచిలి : యలమంచిలి బ్రహ్మకుమారీస్ బ్రాంచి కార్యాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి ముగింపు కార్యక్రమం జరిగింది. రాధాకృష్ణుల వేషధారణతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ దేవి, రామునాయుడు, విజయలక్ష్మి, జ్యోతి, మాలతి, మంగతల్లి పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ పరిధి గొల్లపేట గ్రామంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి పాల్గొని పూజలు చేశారు. సాము గరిడీలు, చిడతలు, తప్పుడుగుల్లు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి మాసవరపు అప్పలనాయుడు సునీత, మాజీ జెడ్‌పిటిసి మాధంశెట్టి నీలబాబు పాల్గొన్నారు. మండలంలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలతో సందడి చేశారు.

వడ్డాది : బుచ్చెయ్యపేట మండలం ఎల్బిపి అగ్రహారంలోని శ్రీకృష్ణ ఆలయంలో గురువారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, టిడిపి నేత బత్తుల తాతయ్యబాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని గుల్లిపల్లి గ్రామంలో జరిగిన శ్రీకృష్ణుని జన్మాష్టమి వేడుకల్లో టిడిపి మాడుగుల నియోజకవర్గం పైలా ప్రసాదరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నసమారాధనకు రూ.5000 విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కొరెడ్డి దేముడుబాబు, టిడిపి నాయకులు రాళ్లపల్లి దేముడు, తంగేటి శ్రీను, కడుపుట్ల గంగరాజు, యాదవ సంఘం నాయకులు డొప్ప ఎర్రిబాబు, సీమునురు నూకరాజు, బోను గంగునాయుడు, వియ్యపు దేముళ్ళు, పాల్గొన్నారు. మండలంలోని చౌడువాడ శివారు గరుగుబిల్లి, కింతాడ శివారు గొల్లలపాలెం గ్రామాల్లోని శ్రీకృష్ణ ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం తప్పుడు గుళ్ళు, చిడతల పోటీలు నిర్వహించారు.

అన్న సమారాధనకు విరాళం అందిస్తున్న పైలా ప్రసాదరావు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి - ఆరిలోవ : బిఆర్‌టిఎస్ రోడ్డులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ సమీపంలో బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వెనుక కూర్చున్న మరో యువకునికి గాయాలయ్యాయి. ఆరిలోవ పోలీసుల కథనం ప్రకారం... ఆరిలోవ ప్రాంతానికి చెందిన పడాల శివప్రసాద్ అలియాస్ సిద్ధు(22), బోయపాలెం ప్రాంతానికి చెందిన గెదల మణికంఠ(17) పెందుర్తిలో వివాహ కార్యక్రమానికి బుధవారం హాజరయ్యారు. వివాహం అనంతరం బుధవారం అర్ధరాత్రి అడివివరం నుంచి హనుమంతువాక వైపు తిరిగి బైక్‌పై వస్తున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కూడలి సమీపంలో ఆరిలోవ వైపు మలుపు తిరుగుతున్న లారీని బైక్ బలంగా ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న శివప్రసాద్ తలకు బలంగా గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చున్న గెదల మణికంఠకు తీవ్ర గాయాలు కావడంతో కెజిహెచ్‌కు తరలించారు. ఆరిలోవ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రాథమిక వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

25 కిలోల గంజాయితో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలోని ఎంకె.పట్నం శివారులో 25 కిలోల గంజాయితో ముగ్గురు వ్యక్తులను పట్టుకుని అరెస్టు చేసినట్లు రోలుగుంట ఎస్ఐ నాగ కార్తీక్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో కలిసి ఎంకె.పట్నం శివారులో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, గంజాయితో ఎంకే.పట్నం గ్రామానికి చెందిన సారమండ నూకరాజు, రావణపల్లికి చెందిన ముంజేటి ఈశ్వరరావు, ఎస్.రామోజీలను పట్టుకున్నామన్నారు. నిందితుల నుంచి 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

వృద్ధుడు అదృశ్యం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బయటకు వెళ్లిన వృద్ధుడు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గురువారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఎవిఎన్ కాలేజీ దరి రెల్లివీధికి చెందిన కోన ఆదినారాయణ (73) జూలై 15న ఉదయం 6.30 గంటలకు ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఆయన కోసం పలు చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో బాధిత కుటుంబీకులు పోలీసులను ఆశ్రయించారు. ఆదినారాయణ ఐదు అడుగుల ఎత్తు, నలుపు రంగులో ఉంటాడని, ఇంటి నుంచి వెళ్లేటప్పుడు నీలం రంగు చొక్కా, ఆరెంజ్ రంగు టవల్ కట్టుకుని ఉన్నాడని కుటుంబీకులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వాళ్లు 9247743831, 7386880196, 9440796019 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

500 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక ఇమ్మాన్యుయేల్ ఫార్మసీ కళాశాలలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని కళాశాల చైర్మన్ డాక్టర్ వి.విద్యాసుందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. వైఎంసిఎ, ఫార్మసీ కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరంలో క్వీన్స్ ఎన్నారై ఆసుపత్రి వైద్యులు అరవింద్, శ్రీవాణి, శివప్రసాద్, శ్రీవల్లి సేవలందించారు. సుమారు 500 మంది రోగులకు పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎంసిఎ వైస్ ప్రెసిడెంట్ పీటర్ మాథ్యూ, డైరెక్టర్లు రోనాల్డ్ విలియమ్స్, ఇజ్రాయెల్, లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఐ.పద్మలత, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంపత్, ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ ఎం.బంగారురాజు తదితరులు పాల్గొన్నారు.

పంచ గ్రామాల భూ సమస్యపై ర్యాలీ

ప్రజాశక్తి-సింహాచలం

పంచ గ్రామాల భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సమైక్య ప్రజా, రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యాన గురువారం సింహాచలం తొలి పావంచా నుంచి గోపాలపట్నం పెట్రోల్ బంక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, పంచ గ్రామాల భూ సమస్యను పరిష్కరిస్తామని చెప్పి అధికారాన్ని చేపడుతున్న ప్రభుత్వాలు తర్వాత కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని విమర్శించారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని చెప్పి గద్దెనెక్కిన వైసిపి ప్రభుత్వం నాలుగేళ్లలో చేసిందేమీ లేదన్నారు. సమస్య ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉందని ఎద్దేవాచేశారు. కనీసం మరమ్మతులకు గురైన ఇళ్లను బాగుచేసుకునేందుకు కూడా అనుమతి ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. మరమ్మతులు కోసం పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే జిల్లా అధికారులు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు స్పందిస్తూ ఇళ్ల మరమ్మతులు చేసుకోవచ్చని తెలిపారని, కానీ ఆచరణలో మాత్రం దేవస్థానం అధికారులు అడ్డుకుంటున్నారని వివరించారు. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన ఇళ్లకు మరమ్మతులు చేసుకోకపోతే గోడలు పడిపోయే పరిస్థితి ఉందన్నారు.

బి.రమణి అధ్యక్షతన జరిగిన ఈ ర్యాలీలో నాయకులు టివి.కృష్ణంరాజు, సిహెచ్ఎస్ గోపాలకృష్ణ, వివిఎస్ ప్రసాద్, బి.అరుణ్ కుమార్, హెచ్.కోటేశ్వరరావు, ఎస్.రాజు, ఎస్వి.రమణ, వి.నారాయణరావు, కృష్ణారావు, బి.శంకరరావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, తదితరులతో పాటు వివిధ కాలనీలకు చెందిన బాధితులు పాల్గొన్నారు.

సింహాచలం తొలి పావంచా నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి : సిపిఐ

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు పరిధి మధురానగర్ సర్వేనెంబర్ 12లో సుమారు 130 గజాల విలువైన ప్రభుత్వ స్థలంలో అక్రమంగా పక్కా భవనాన్ని నిర్మిస్తున్న భూకబ్జాదారులు నున్న మల్లేష్, నున్న శంకర్‌పై చర్యలు తీసుకోవాలని సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు డిమాండ్‌చేశారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ అక్రమ నిర్మాణాన్నిఉత్తర నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, స్థానిక కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ పరిశీలించి ఇది రజకుల పక్కా గెడ్డ పోరంబోకు స్థలమని, దీనిలో కట్టడాలు నిర్మించరాదని చెప్పారని తెలిపారు. ఈ నిర్మాణంపై స్థానిక రజకులు తహశీల్దార్‌కు కూడా ఫిర్యాదు చేశారని చెప్పారు. తహశీల్దార్ స్థలాన్ని పరిశీలించి ఇది రజకుల కులవృత్తి చేసుకునే ధోబీ ఘాట్ స్థలంగా నిర్ధారించి, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరిస్తూ స్థానిక సచివాలయ కార్యదర్శికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. దీంతో అప్పట్లో కొంతమేర ఆక్రమణలను తొలగించారని చెప్పారు. ఆక్రమణ దారులు మళ్లీ భవనాన్ని నిర్మించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. జివిఎంసి, రెవెన్యూ యంత్రాంగం స్పందించి ఈ అక్రమ నిర్మాణాన్ని వెంటనే కూల్చివేసి భూ ఆక్రమణకు పాల్పడిన నున్న శంకర్రావు, నున్న మల్లేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. విలువైన ప్రభుత్వ స్థలాన్ని రజకుల కులవృత్తికి లేదా ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని విజ్ఞప్తిచేశారు. విలేకర్ల సమావేశంలో పి.చంద్రశేఖర్, నెయ్యల నాగభూషణరావు, కోనేటి లక్ష్మి, నూకరాజు, కోరబిల్లి సంతోష్, కె.అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా సాహిని సీతారాం జయంతి

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖపట్నం శిష్టకరణ సంఘం వ్యవస్థాపకులు సాహిని సీతారాం జయంతిని అక్కయ్యపాలెం అబిద్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు సీనియర్ న్యాయవాది సహని రమేష్ మాట్లాడుతూ ,సీతారాం పేదలకు ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ఆయన జ్ఞాపకార్థం సీతారాం లీగల్ ఛాంబర్ ద్వారా పేదలకు న్యాయ సలహాలు, సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆయన కుమారుడు సాహిని సత్యనారాయణ కూడా పేదలకు న్యాయం చేసే విధంగా కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీతారాం కుటుంబ సభ్యులు శ్రీనివాస్, రామదూయత నీరజ, సాధన, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రాజశేఖర్‌కు పరామర్శ

ప్రజాశక్తి -గాజువాక : రోడ్డు ప్రమాదానికి గురై ఆరిలోవ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఐఎన్‌టియుసి జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్‌ను పిసిసి కార్యదర్శి జెర్రిపోతుల ముత్యాలు గురువారం పరామర్శించారు. ఆయనతోపాటు నడుపూరు గ్రామ పెద్దలు సియ్యాద్రి సత్యారావు, సియ్యాద్రి అప్పారావు, కొండకంచి అప్పారావు, పప్పల అదిబాబు ఉన్నారు.

మంత్రి రాజశేఖర్‌ను పరామర్శిస్తున్న ముత్యాలు

సమస్యలు పరిష్కరించాలి : గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం : పశ్చిమ నియోజకవర్గంలోని గెడ్డలు, కాలువల సమస్యలు పరిష్కరించాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మను ఎమ్మెల్యే గణబాబు కోరారు. ఈ మేరకు జివిఎంసిలోని కమిషనర్ ఛాంబర్‌లో కమిషనర్‌ను ఎమ్మెల్యే బుధవారం కలిసి సమస్యలపై మాట్లాడారు. హెచ్‌పిసిఎల్ విస్తరణ సమయంలో పబ్లిక్ హియరింగ్‌లో సంస్థ అంగీకరించిన రెండు డ్రెయిన్ల నిర్మాణాలను పూర్తిచేయించాలని కోరారు. మొదటిది మల్కాపురం డ్రెయిన్ పూర్తిచేశారని తెలిపారు. రెండవది శ్రీహరిపురం డ్రెయిన్ ఎంఐజి కాలనీ మీదుగా ఎక్స్ సర్వీస్ మెన్ కాలనీ, కోరమండల్ సంస్థ, గుల్లలపాలెం మీదుగా సముద్రంలోకి నీరు కలిసే గెడ్డను పూర్తిచేయించాలని కోరారు. శ్రీహరిపురం డ్రెయిన్‌కు గతంలో డిపిఆర్ తయారయ్యిందని, హెచ్‌పిసిఎల్ నుంచి నిధులు మంజూరు చేయించుకొని పనులు పూర్తిచేయాలని కోరారు.

ఎన్ఎడి తారకరామ అపార్ట్‌మెంట్ వెనుక నుంచి కరాస, మర్రిపాలెం, శ్యామ్‌నగర్ కాలనీ మీదుగా కంచరపాలెం చాకలిగెడ్డ వరకు నిలిచి ఉన్న నీరును పారే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వేదాద్రిపేట కాలనీ, అశోక పార్క్ సమీపంలోని కాలువలో నిలిచిపోయిన చెత్తను తొలగించాలని విజ్ఞప్తిచేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 85వ వార్డు అగనంపూడి నిర్వాసిత కాలనీలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గురువారం పలు అభివృద్ధి పనులు పనులకు శంకుస్థాపన చేశారు. కొండయ్యవలసలో రూ.20 లక్షలతో సామాజిక భవనం, డొంకాడలో రూ.20 లక్షలతో వరద నీటి కాలువ, బొర్రమాంబ ఉప్పర కాలనీలో రూ.50 లక్షలతో రక్షణ గోడ నిర్మాణానికి ఎమ్మెల్యే నాగిరెడ్డి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలో మౌలిక సదుపాయాలు కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి మాట్లాడుతూ, వార్డు పరిధిలో ముఖ్యమైన సమస్యలను గుర్తించి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ, వైసిపి నాయకులు యలమంచిలి అప్పారావు, నక్క రమణబాబు, గెద్దాడ సత్యవతి, దాసరి సత్యవేణి బలిరెడ్డి శ్రీను దానబాల అప్పలనాయుడు గెద్దాడ అప్పలరాజు, పిల్లా కొండలరావు, ఐఆర్‌సిహెచ్ అప్పారావు, పిల్లా సురేష్, విందుల వరహాలు, జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

భానాస రాష్ట్ర కన్వీనర్‌గా శ్రీరామమూర్తి

ప్రజాశక్తి-సీతమ్మధార : భారత నాస్తిక సమాజం (భానాస) రాష్ట్ర అడహక్ కమిటీ ఎన్నిక జరిగిందని, రాష్ట్ర కన్వీనర్‌గా టి.శ్రీరామమూర్తి ఎన్నికైనట్లు కేంద్ర కమిటీ కన్వీనర్ ఆర్ఎస్‌వి.మురళి వెల్లడించారు. గురువారం అంబేద్కర్ భవన్‌లో మీడియాతో మురళి మాట్లాడుతూ, ఏడుగురు సభ్యులతో కూడిన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నామని తెలిపారు. రాష్ట్ర కన్వీనర్‌తో పాటు కమిటీ సభ్యులుగా జె.శ్యామల, వీరబాబు, కె.విజయకుమార్, మధుసూదన్, జి.వికాస్, శ్రీరామ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని వివరించారు. 1972లో ఏర్పడ్డ భానాస 50 సంవత్సరాలకు పైగా సమాజంలోని మానవ హక్కులు, అంటరానితనం నిర్మూలన, స్త్రీ వివక్ష, కుల, మత, మూఢవిశ్వాసాల నిర్మూలన, దేవుడి పేరుతో జరిగే దోపిడీలకు వ్యతిరేకంగా భానాస పోరాడుతోందని వివరించారు. చంద్రయాన్ పేరుతో ఒకవైపు జాబిల్లిపైకి రాకెట్లను పంపిస్తున్న నేటి తరుణంలో, మరోవైపు అదే రాకెట్ నమూనాను తీసుకువెళ్లి తిరుపతి, చంగాలమ్మ గుళ్లల్లో పూజలు చేయడం ప్రజలను మధ్యయుగం నాటి ఆచార సంప్రదాయాల వైపు తీసుకువెళ్లడమే అన్నారు. ప్రశ్నించే తత్వాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని కల్పించి ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. మూఢనమ్మకాల నిర్మూలన చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరుతూ చేపట్టే ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యులు జె.రవి, చార్వాక, రషీద్, తదితరులు పాల్గొన్నారు.

నడక ఆరోగ్యానికి మంచిది

కిమ్స్ ఐకాన్ డాక్టర్ అపర్ణ

ప్రజాశక్తి -గాజువాక : నడక ఆరోగ్యానికి చాలా మంచిదని షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ కన్సల్టెంట్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ అపర్ణ తెలిపారు. నేటి ఆధునిక వైద్య వృత్తిలో ఫిజియోథెరపీని ఒక నూతన అధ్యాయంగా పేర్కొనవచ్చన్నారు. ఫిజియోథెరపీ అంటే ఫిజికల్ ఎక్సర్‌సైజ్ (శారీరక వ్యాయామం)గా చెప్పుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం ఎన్నో జబ్బులను ఫిజియోథెరపీ ద్వారా నయం చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా ఆర్థో, న్యూరో స్పెషలిస్టులు రోగుల శారీరక సమస్యలను బట్టి వ్యాయామాలను సూచిస్తారని తెలిపారు. ఫిజియోథెరపిస్టు ఆధ్వర్యాన ఈ వైద్యాన్ని పొందవచ్చని చెప్పారు.

ఈ వైద్యం ద్వారా దీర్ఘకాలిక సమస్యలైన స్పాండిలైటిస్, ఫ్రోజెన్ షోల్డర్, టెన్నిస్ ఎల్బో తదితర ఇబ్బందుల నుంచి ఉపశమనం పొందవచ్చని తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఫోన్లు, కంప్యూటర్ వాడకం వల్ల భుజాలు, మెడ, నడుము నొప్పులతో బాధ పడుతున్నారని, ఇటువంటి వారికి ఫిజియోథెరపీ ద్వారా ఉపశమనం పొందవచ్చని పేర్కొన్నారు. ఫిజియోథెరపీ ద్వారా తల్లి కడుపులో పెరిగే బిడ్డతో మొదలు వయోవృద్ధుల వరకు ఎన్నో జబ్బులను తగ్గించవచ్చని వివరించారు.

కండరాల పునరుద్ధరణకు దోహదం

గాయం, వైకల్యం కారణంగా శరీర భాగాల కదలిక పనితీరును సాధారణ స్థితికి తెచ్చేందుకు ఫిజియోథెరపీ చికిత్స ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యంగా పక్షవాతం, మెడ, నడుము నొప్పి, మోకాళ్ళ, భుజం నొప్పి, వెన్ను సమస్యలు శస్త్ర చికిత్సకు ముందు తర్వాత వాటి పనితీరును పునరుద్ధరించడానికి రిహాబిలిటేషన్ ఉపయోగపడుతుందని తెలిపారు.

గీతంలో ఓపెన్ స్కూల్

ప్రజాశక్తి-మధురవాడ : సైన్స్ కోర్సుల పట్ల విద్యార్థులలో ఆసక్తిని పెంచడంతో పాటు పదో తరగతి, ఇంటర్‌మీడియట్ తరువాత గల విద్యావకాశాలు, పరిశోధకులుగా మారాలంటే చేయాల్సిన కృషి, ఆసక్తి కలిగించే విజ్ఞాన శాస్త్ర వింతలను తెలియచెబుతూ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సామాజిక బాధ్యతగా ఓపెన్ స్కూల్ పేరిట సరికొత్త కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టింది. దీనికి నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల నుంచి దాదాపు 1000 మంది విద్యార్థులు మొదటిరోజు గీతం విశ్వవిద్యాలయాన్ని సందర్శించి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గీతం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే విజ్ఞాన శాస్త్రం పట్ల అవగాహన, అభిరుచి పెంచుకోవడం ద్వారా దేశ ప్రగతిలో యువత భాగస్వాములు కావచ్చన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కృష్ణ మాట్లాడుతూ, గణితశాస్త్రం, భౌతిక రసాయన శాస్త్రాలు, జీవశాస్త్ర పరిశోధనలు మానవ మనుగడకు మూలం అని తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వేదవతి మాట్లాడుతూ, ఇంజినీరింగ్, మెడిసిన్ కాక సైన్స్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించే ఎన్నో కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా అందిస్తున్న వివిధ సైన్స్ సంబంధ డిగ్రీ, పీజీ కోర్సుల వివరాలను వెల్లడించారు. వివిధ సైన్స్ విభాగాల సీనియర్ ప్రొఫెసర్లు హాజరై విద్యార్థులకు ఆసక్తి కలిగించే సైన్స్ పరిశోధనలను వివరించారు. ఓపెన్ స్కూల్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను వివిధ సైన్స్ విభాగాలు, పరిశోధన కేంద్రాలను పరిశీలించే అవకాశం కల్పించారు. ఓపెన్ స్కూల్ కార్యక్రమం ద్వారా సైన్స్‌తో పాటు మేనేజ్‌మెంట్, లా, ఆర్కిటెక్చర్, ఫార్మసీ, ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ విభాగాలను విద్యార్థుల సందర్శనకు అనుమతిస్తున్నట్లు గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ తెలిపారు.

30 మంది రక్తదానం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం రామవరం గ్రామంలో నమ్మి జగదీష్ మొదటి వర్ధంతి సందర్భంగా న్యూ ట్రెండింగ్ యూత్ ఆధ్వర్యాన ఛత్రపతి శివాజీ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 30 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ శిబిరంలో వైసిపి నాయకులు కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, ఎంపిటిసి గొలగాని కృష్ణ, సర్పంచ్ వై.పైడిరాజు, గ్రామ పెద్దలు, యువకులు, రక్తదాన చైతన్యకర్త వి.వినోద్‌బాబు, ఛత్రపతి శివాజీ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ రాజు, న్యూ ట్రెండింగ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

సిఐటియు ఆధ్వర్యాన సంతకాల సేకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి
హమాలీ, ముఠా, కళాసీ తదితర అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు డిమాండ్ చేశారు. పని భద్రత, గుర్తింపు కార్డులు, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, పెన్షన్ పథకాలతో కూడిన సమగ్ర చట్టం, వెల్ఫేర్ బోర్డు, సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం సిఐటియు, ముఠా కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు గోదాములు, కూరగాయలు, పండ్ల మార్కెట్లు, వ్యవసాయ మార్కెట్ యార్డులు, కోల్డ్ స్టోరేజీలు, బజారుకొట్లు, రైస్, ఆయిల్, దాల్ మిల్స్, ఆర్టీసీ రైల్వే పోర్టర్లు, ఒడ రేవులు, రైల్వే వేగన్ షెడ్లు, మొదలైన వాటిలో రాష్ట్రంలో సుమారు 5 లక్షల మంది ముఠా కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరంతా ప్రభుత్వాల నిరాధారణకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక బరువులు మోయటం, రోజుకి 12 నుండి 16 గంటలు పని చేయడం వల్ల చిన్నవయసులోనే వృద్ధాప్యంలోకి నెట్టబడుతున్నామని చెప్పారు. ప్రమాదాలకు గురైన వారిని ఆదుకునే వారు లేరని, ప్రమాదంలో చనిపోయిన కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని వాపోయారు. ముఠా కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్.రాము, నాయకులు బొడి రాజు, కళ్యాణం, భీశెట్టి అప్పారావు, వరహాలు, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

ముఠా కార్మికుల నుంచి సంతకాలు సేకరిస్తున్న సిఐటియు నాయకులు

అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో
ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో
43వ వసంతంలోకి అడుగిడిన ప్రజాశక్తి దినపత్రికకు
హృదయపూర్వక శుభాకాంక్షలు
నాగ కార్తీక్ ఎస్.ఐ.
రోలుగుంట పోలీస్‌స్టేషన్
రోలుగుంట మండలం, అనకాపల్లి జిల్లా.

ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో
43వ వసంతంలోకి అడుగిడిన ప్రజాశక్తి దినపత్రికకు హృదయపూర్వక శుభాకాంక్షలు
జి.వి.ఆర్.రాజు ప్రధానోపాధ్యాయులు,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొంతలం గ్రామం
రోలుగుంట మండలం, అనకాపల్లి జిల్లా.

ఆర్థిక సాయం అందజేస్తున్న ముత్యాల సతీష్

విద్యతోనే ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : విద్య ద్వారానే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలమని ప్రముఖ పారిశ్రామికవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు తనయుడు ముత్యాల సతీష్ అన్నారు. స్థానిక నరసింగరావుపేట ఎంవిఆర్ ట్రస్ట్ కార్యాలయంలో గురువారం రష్యాలో ఎంబిబిఎస్ విద్యను అభ్యసిస్తున్న ప్రాంతానికి చెందిన కట్టమూరు కావ్యకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు మాత్రమే జీవితంలో నిలదొక్కుకునేందుకు దోహదపడుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి పెట్టి వారు అనుకున్న గమ్యాన్ని చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ పిఎ సతీష్ కుమార్, అభిమానులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - పరవాడ : పరవాడ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతూ, ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు హాజరవుతున్న 28 మంది విద్యార్థులకు అమ్మ ఛారిటబుల్ ట్రస్టు స్టడీ మెటీరియల్‌ను గురువారం అందజేసింది. పాఠశాల హెచ్ఎం బి.అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకటరావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి, ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో మెరిట్ పొంది ఉపకార వేతనాలు సాధించాలని సూచించారు. ఎ.రామస్వామి మాట్లాడుతూ అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న మెటీరియల్‌ను ఉపయోగించుకొని ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్ సాధించే విధంగా పట్టుదలతో కృషి చేయాలని హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులకు సూచించారు. ట్రస్ట్ సేవలను హెచ్ఎం అప్పలనాయుడు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు జూరెడ్డి దిలీప్, ఉపాధ్యాయులు గోవింద, ఐవి సత్యనారాయణ, పీటర్ పాల్, మంజుల, వెంకట లక్ష్మి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేస్తున్న అమ్మ ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు

కమిషనర్ వీరయ్య సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - యలమంచిలి : మున్సిపాలిటీలో అభివృద్ధికి కమిషనర్ వీరయ్య చేస్తున్న సేవలు అభినందనీయమని సూపరింటెండెంట్ గణపతి రావు అన్నారు. ఈ మేరకు మున్సిపాలిటీలో నాణ్యత ప్రమాణాలతో కూడిన అభివృద్ధి పనులు చేస్తున్న కమిషనర్ వీరయ్యను అభినందిస్తూ సూపరింటెండెంట్ గణపతి రావు మెమొంటో అందజేశారు. గురువారం మున్సిపాలిటీలోని చంద్రనగర్ డంపింగ్ యార్డును పరిశీలించి అక్కడుండే 20 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను బయో రెమిడేషన్ పద్ధతిలో తొలగించిన విధానం చెప్పుదగ్గదిగా వీరయ్యకు కితాబునిచ్చారు. అనంతరం మున్సిపాలిటీలో ఇటీవల చేపట్టిన కొమ్మయ్య గుండం, రామనగర్ బిటి రోడ్డు, పరమేశ్వరి థియేటర్ రోడ్డు, సన్యాసమ్మ చెరువు వాకింగ్ ట్రాక్ పనులు స్వయంగా పరిలించి అభినందించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రోయల్‌బాబు, మున్సిపల్ ఏఇ గణపతి సుబ్బారావు, శానిటరీ ఇన్స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కమిషనర్ వీరయ్యకు మెమొంటో ఇస్తున్న గణపతిరావు

సిపిఐ బహిరంగ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-చోడవరం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా సిపిఐ చేపట్టిన బస్సు యాత్ర ముగింపు సందర్భంగా తిరుపతిలో జరుగు బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా సమితి సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు బహిరంగ సభ కరపత్రాన్ని గురువారం విడుదల చేశారు. మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టి, కార్మికుల పొట్ట కొట్టేందుకు ప్రయత్నిస్తుందని, ఈ దుర్మార్గ చర్యలకు సిఎంజగన్ వంత పాడుతున్నారని విమర్శించారు. వరి ప్రసాదు, దేవుడు, కొండబాబు, పైడిబాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

పెద్దాడ వెంకట రమణ
జి.రమణాజీ
వేచలపు అప్పలనాయుడు
ఉషోదయ డిగ్రీ కాలేజ్
దేవరాపల్లి మండలం, అనకాపల్లి జిల్లా.

ప్రజాశక్తి
43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

కె.వి.ఎస్.రాఘవమ్మ
పశు వైద్యాధికారిణి
పెద్దగోగాడ
చీడికాడ మండలం,
అనకాపల్లి జిల్లా.

ప్రజాశక్తి
43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో
ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో
43వ వసంతంలోకి అడుగిడిన ప్రజాశక్తి దినపత్రికకు
హృదయపూర్వక శుభాకాంక్షలు

చెల్లిబోయిన కృష్ణ
హెల్త్ అసిస్టెంట్, దేవరాపల్లి పి.హెచ్.సి.
దేవరాపల్లి మండలం, అనకాపల్లి జిల్లా.

ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో
43వ వసంతంలోకి అడుగిడిన ప్రజాశక్తి దినపత్రికకు హృదయపూర్వక శుభాకాంక్షలు
వరప్రసాద్ ప్రధానోపాధ్యాయులు,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రోలుగుంట గ్రామం
రోలుగుంట మండలం, అనకాపల్లి జిల్లా.

ప్రజాశక్తి
43వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో
ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో
43వ వసంతంలోకి అడుగిడిన
ప్రజాశక్తి దినపత్రికకు శుభాకాంక్షలు
బి.పడాల్‌దాస్
M.E.O.-1
బి.ఉషారాణి
M.E.O.-2
దేవరాపల్లి మండలం, అనకాపల్లి జిల్లా.

వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

వలస కార్మికులకు చట్టాలు అమలు చేయాలని వినతి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : జిల్లాలోని పలు పరిశ్రమలలో పనిచేస్తున్న వలస కార్మికులకు కార్మిక చట్టాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు, ఉపాధ్యక్షులు ఆర్ రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా కార్మిక కార్యాలయంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కె నరేంద్రకు గురువారం వినతి పత్రాన్ని అందించారు. వలస కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా శంకర్రావు రాము మాట్లాడుతూ వలస కార్మికుల నివాసముంటున్న షెడ్ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించడానికి సంబంధిత యాజమాన్యాలు దృష్టి సారించేలా చర్యలు చేపట్టాలని కోరారు. పరిశ్రమల యజమానులు ఇతర రాష్ట్రాల నుండి కార్మికులను తీసుకువచ్చి ఇక్కడ ఇరుకు గదులలో ఉంచుతున్నారని, గాలి, వెలుతురు మంచినీరు, పారిశుధ్యం వంటి కనీస మౌలిక సదుపాయాలు లేక వారు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మౌలిక సౌకర్యాలు కల్పించకుండా వలస కార్మికుల శ్రమను పరిశ్రమ యాజమాన్యాలు కాంట్రాక్టర్లు దోచుకుంటున్నారని పేర్కొన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, రక్షణ కల్పించాలని కోరారు.

12 నుంచి మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు

ప్రజాశక్తి- అనకాపల్లి : ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు అనకాపల్లి మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు అండర్ 14, 11, 17 విభాగాలలో బాల, బాలికలకు వేర్వేరుగా తొమ్మిది క్రీడాంశాలలో క్రీడా పోటీలు నిర్వహించి మండల టీములను ఎంపిక చేయడం జరుగుతుందని మండల స్థాయి స్కూల్ గేమ్స్ కన్వీనర్ ఎస్వి నరసింహం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖోఖో, కబడ్డీ, టెన్నికాయిట్, త్రోబాల్, వాలీబాల్, షటిల్, బాల్ బ్యాడ్మింటన్, యోగ, అథ్లెటిక్స్ క్రీడాంశాలలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొని విద్యార్థులు తమ ఎస్ఐఎఫ్ ఎలిజిబిలిటి పత్రంతోపాటు ఎండిఎం ఎక్సిటెన్స్ తప్పనిసరిగా తీసుకురావాలని కోరారు. ఇతర వివరాలకు 9247150037 నెంబర్కు సంప్రదించాలని కోరారు.

పట్టణంలో ఎమ్మెల్యే ధర్మశ్రీ పర్యటన

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం పట్టణ సమస్యలు పరిష్కారం కోసం నిరంతరం వార్డుల్లో తనిఖీలు చేపట్టామని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తెలిపారు. గురువారం ఆయన దుడ్డు వీధి వార్డులో పర్యటించారు. స్థానికులతో సమావేశం ఏర్పాటు చేసి వార్డులో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే వాటి పరిష్కారం కోసం ఇతర శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోడవరం పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేయవలసిన అవసరం ఉందని, ఇందుకోసం ఇప్పటికే ఇంటింటి కుళాయి పనులు పూర్తయ్యాయని తెలిపారు. చోడవరం పట్టణానికి అనుసంధానం చేస్తూ గ్రామీణ ప్రాంత రహదారులన్నీ నూతన రోడ్లుగా మార్చడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఏడువాక సత్యారావు, ఆసుపత్రి కమిటీ ఛైర్మన్ జ్యోతుల రమేష్ సర్పంచ్ బండి నూకాలమ్మ శ్రీను, వార్డు సభ్యులు ఒరుగంటి నెహ్రూ పాల్గొన్నారు.

చోడవరంలో పర్యటిస్తున్న ధర్మశ్రీ

10న సమగ్ర శిక్ష ఉద్యోగుల వేడుకోలు దీక్షలు

ప్రజాశక్తి-అనకాపల్లి

సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం టైమ్స్ స్కేల్ అమలు చేసి వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటివి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న అనకాపల్లి జిల్లా కేంద్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల వేడుకోలు దీక్షలు చేపడుతున్నామని జిల్లా జెఎసి నాయకులు అచ్యుతకృష్ణ, వివి.శ్రీనివాసరావు తెలిపారు. ఆ రోజు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నుంచి నెహ్రూ చౌక్ జంక్షన్ వరకు ప్రదర్శన, అనంతరం అక్కడ వేడుకోలు దీక్ష ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షలోని అన్ని విభాగాల ఉద్యోగులతో పాటు కేజీబీవీలోని టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న సిఆర్పిలు, పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, మెసెంజర్లు, ఐఈఆర్పిలు, ఫీల్డ్ ఇంజనీరింగ్లు ఇలా అనేక విభాగాల్లో పనిచేస్తున్న వారితో పాటు కేజీబీవీలలో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది తీవ్ర అన్యాయానికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం, మంత్రులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదని, నిరసనలు తెలియజేస్తున్నా ఈ ప్రభుత్వానికి చలనం లేదని పేర్కొన్నారు. ఈ వేడుకోలు దీక్ష ద్వారా ముఖ్యమంత్రి జగన్ మోహన్రెడ్డికి మనసు చలించాలన్నారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు నాగేశ్వరరావు, వరప్రసాద్, రామచంద్రరావు, నూకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ గురువారం గాంధీనగరంలో జోరు వానలోను గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. అనకాపల్లి పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానికులు తమకు టిట్కో ఇల్లు మంజూరు చేయాలని మంత్రిని కోరగా, దసరా నాటికి ఇల్లు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. అనంతరం 82వ వార్డులోని ఇన్కమ్ టాక్స్ స్ట్రీట్లో రూ.10.50 లక్షలతో సిసి రోడ్డు, ఆర్సీసీ కన్వర్టర్ల పనులకు, నెహ్రూ చౌక్ నుంచి గుండాల వీధి వరకు రూ.141లక్షలతో నిర్మించనున్న తారు రోడ్డు, ఫుట్పాత్ టైల్స్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీనగర్ ప్రాంతానికి చెందిన కొండూరు రవీంద్రనాథ్ నేతృత్వంలో పలువురు మంత్రి అమర్నాథ్ సమక్షంలో వైసీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏపీ ఇన్లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఛైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, జీవీఎంసీ జోనల్ కమిషనర్ వెంకటరమణ, వైసిపి జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, జిల్లా హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ రామ్మూర్తి, మూనూరి శ్రీను, 84 వార్డు ఇంచార్జి కోరుకొండ రాఘవ పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న మంత్రి అమర్నాథ్

నూకాంబిక ఆలయ

పునర్నిర్మాణ పనులకు మంత్రి అంకురార్పణ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ దంపతులు గురువారం అంకురార్పణ చేశారు. అమర్నాథ్ దంపతులను ఆలయ ఛైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమర్నాథ్ దంపతులు అమ్మవారికి పట్టుబట్టలు, గాజులు సమర్పించారు. ప్రస్తుతం ఉన్న ఆలయ గర్భాలయాన్ని విస్తరించడంతోపాటు, ఆలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు, తిరుమల తిరుపతి దేవస్థానం నుండి రూ.3కోట్లు మంజూరు చేయడంతో ఈ పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే కోటిన్నర రూపాయలు విడుదల చేశారని, మొత్తం నిధులను త్వరలోనే అందజేస్తామని మంత్రి తెలిపారు. భక్తులకు సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశంతో ఆలయ ఆధునికీకరణ పనులు చేపట్టామన్నారు. ఉగాది నాటికి ఈ పనులు పూర్తి చేస్తామన్నారు. ఏపీఐడబ్ల్యుఏ ఛైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, ఎన్టీఆర్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ రామ్మూర్తి, వైసిపి యువజన నాయకులు దాడి జైవీర్, జాజుల రమేష్, ఏఎంసి రమేష్ గుప్తా, శోభ, దాడి నారాయణరావు, పద్మ పాల్గొన్నారు.

చంద్రబాబును విమర్శించడం సిగ్గుచేటు

ప్రజాశక్తి- అనకాపల్లి : ముఖ్యమంత్రిగా 14 సంవత్సరాలు అవినీతి, మచ్చలేని చంద్రబాబు నాయుడును చంచలగూడ జైల్లో చిప్పకూడు తిన్న జగన్ రెడ్డి, వైసీపీ నాయకులు విమర్శించడం సిగ్గు చేటని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు విమర్శించారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అవినీతి అక్రమాలు పునాదులపై ఆవిర్భవించిన వైసిపికి ఇంతకంటే మంచి ఆలోచనలేమొస్తాయని ఎద్దేవా చేశారు. చంద్రబాబుకు వచ్చిన ఐటీ నోటీసులకు ఎలాంటి విలువ లేదన్నారు. అవినీతి కేసుల్లో జైలుకు వెళ్లి 43 వేల కోట్లు ఆస్తులు ఈడీ జప్తులో ఉన్న జగన్ రెడ్డి చరిత్ర ప్రజలు ఇంకా మరిచిపోలేదని పేర్కొన్నారు. రాష్ట్రానికి రావలసిన నిధులు, ప్రాజెక్టులు, విభజన చట్టంలో హామీలను కేంద్ర బిజెపి పెద్దలకు తాకట్టు పెట్టి సిబిఐ కేసుల నుండి రక్షించమని వేడుకుంటున్న విషయం అందరికీ తెలుసన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు డాక్టర్ కేకేవీపి నారాయణరావు, దాడి జగన్, ఆకుల నానాజీ, కర్రి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికే రైతు భరోసా కేంద్రాలు

ప్రజాశక్తి- అనకాపల్లి : రైతుల సంక్షేమానికే వైసీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి పేర్కొన్నారు. స్థానిక వివేకానంద ఫంక్షన్ హాల్లో గురువారం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో అగ్రికల్చర్ సైంటిస్టులు, ఎఫ్పిఓ సభ్యులు, అధికారులతో జరిగిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉద్యానవన శాఖ అందిస్తున్న సేవలను ఎఫ్పిఓ సభ్యుల సందేహాలను వ్యవసాయ అధికారులు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖాధికారి ప్రభాకర్, ఎస్వీడిఎస్ జోగినాయుడు, హెచ్ఆర్ఎస్ కే శివకుమార్, బీసీటీ కెవికే శైలజ, కె.వి.కె రాజశేఖర్, నాబార్డ్ కిరణ్, స్టేట్ బ్యాంక్ మేనేజర్, హార్టికల్చర్ ఆఫీసర్స్, అనకాపల్లి జిల్లా ఎఫ్పిఓ ప్రెసిడెంట్స్, అధికారులు పాల్గొన్నారు.

50 శాతమే వరి ఉడుపులు

ప్రజాశక్తి - యలమంచిలి : తగిన వర్షాలు లేక నీటి ఎద్దడి మూలంగా మండలంలో వరి ఉడుపులు సగం మాత్రమే పూర్తయ్యాయని మండల వ్యవసాయాధికారి మోహన్రావు తెలిపారు. గురువారం తనను కలిసిన విలేకర్లతో ఆయన మాట్లాడుతూ మండలంలో 5,443 ఎకరాల్లో వరి ఊడ్పులు జరగాల్సి ఉండగా నేటికి 2,474 ఎకరాల్లో మాత్రమే జరిగాయని వివరించారు. తగిన సమయంలో వర్షాలు లేకపోవడమే దీనికి కారణమన్నారు. సెప్టెంబరు మొదటి వారంలో నేటివరకు ఆశాజనకంగా 77.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో వరికి అనుకూలమైన వాతావరణం ఏర్పడిందన్నారు. అయితే ఇప్పటికే వరినారు ముదిరి పోయిందని, ఊడ్చినా దిగుబడి అంతంత మాత్రమే వస్తుందని, కాబట్టి వరి దగ్గరగా కుదుళ్ళు పెట్టుకోవాలని సూచించారు. ముదిరిన నారుతో మరో 20 శాతం ఊడ్పులు జరగొచ్చన్నారు. ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు మినప, పెసలు, ఎదవరి వేసుకోవచ్చని, వాటికి అవసరమైన విత్తనాలు 80 శాతం సబ్సిడీపై అందించడం జరుగుతుందని చెప్పారు. వరి రైతులకు అవసరమైన యూరియా, డిఎపి రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా భూలోకమాంబ పండగ

ప్రజాశక్తి - పరవాడ : పరవాడ గ్రామంలో భూలోకమాంబ అమ్మవారి పండుగ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు పైల శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అన్నసమారాధన కార్యక్రమాన్ని పైల శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, నాయకులు గండి ఈశ్వరరావు, చీపురుపల్లి సన్యాసిరావు, చీపురుపల్లి సన్యాసిరావు, పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు లేవు

ప్రజాశక్తి-చోడవరం : విద్యుత్తు వినియోగదారులకు ఎటువంటి విద్యుత్ కోతలు లేవని చోడవరం విద్యుత్ శాఖ ఏడి కుమార్ గౌరీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఈఆర్సి ఆదేశాల మేరకు గతంలో పరిశ్రమలకు 70 శాతం విద్యుత్ వినియోగించాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి మెరుగుపడినందున పరిశ్రమలకు, గృహ వినియోగదారులకు నిరంతరాయంగా, వ్యవసాయానికి 9 గంటలు విద్యుత్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

వినాయక ఘాట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి వినాయక ఘాట్ అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు చేయాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్కు వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా కమిటీ ఛైర్మన్ ఆడారి కుమారస్వామి మాట్లాడుతూ ఈనెల 18న జరిగే వినాయక నవరాత్రి ఉత్సవాలకు నిమజ్జనోత్సవ కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. దీనికి మంత్రి అమర్నాథ్ స్పందిస్తూ పనులు తక్షణమే పూర్తి చేయాలని జోనల్ కమిషనర్ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిటీ నేతలు తాటికొండ శ్రీకాంత్, పెంటకోట వరప్రసాద్, ఉగ్గిన శ్రీను, అల్లు త్రినాథ్, కోట నాగేష్, ఆడారి శ్రీను (పాడేరు), మల్ల భోగ లింగం, పిళ్లా రాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : సబ్బవరం పిఎస్లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సబ్బవరపు కుమారస్వామి భార్య హైమకు ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు ఒక రోజు వేతనంగా ఇచ్చిన రూ.3,94,050 చెక్కును కార్యాలయంలో జిల్లా ఎస్పీ కెవి.మురళీకృష్ణ గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయ భాస్కర్, జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనాధికారి బి.శారద, సీనియర్ అసిస్టెంట్ డి.భవాని పాల్గొన్నారు.

జనసేన గ్రామ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : స్థానిక జనసేన కార్యాలయంలో గురువారం పార్టీ నాయకులు టెక్కలి పరశురాం అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామ కమిటీ ఎన్నిక జరిగింది. గ్రామశాఖ అధ్యక్షుడిగా సూరిశెట్టి అప్పలనాయుడు, ఉపాధ్యక్షుడిగా సిహెచ్ మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఆడారి సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా పెంటకోట సంతోష్, కోశాధికారిగా మద్దాల సాయి, కార్యవర్గ సభ్యులుగా కారుకొండ రాజు, తుట్ట అశోక్, పి ఉమామహేశ్వర రావు, కే కేదార్, బి సురేంద్ర, ఎస్ కిషోర్, టి సుధీర్, టీ మోహిత్, కిషోర్, జి లక్ష్మణ ఎన్నికయ్యారు.

దొండపూడి మాజీ సర్పంచ్ మృతి

రాజునాయుడు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలంలోని దొండపూడి మాజీ సర్పంచ్, వైసిపి సీనియర్ నేత గ్రట్రెడ్డి రాజునాయుడు (85). గురువారం మతి చెందారు. దొండపూడి గ్రామ సర్పంచ్‌గా 1964 నుంచి 1989 వరకూ ఏకధాటిగా 25 ఏళ్లపాటు కొనసాగిన రాజునాయుడు 1999లో కల్యాణపులోవ రిజర్వాయర్ ఆయకటు చైర్మన్ గా బాధ్యతలు చేపట్టారు. అప్పట్లో కాంగ్రెస్ ముఖ్య నాయకుడిగా, ద్రోణంరాజు సత్యనారాయణ, బాటం శ్రీరామ్మూర్తి, తంగేడు రాజు, గుడివాడ గుర్నాధరావు, మాజీ మంత్రి బలిరెడ్డి సత్యారావులతో రాజకీయంగా మంచి నమ్మకమైన వ్యక్తిగా వ్యవహరించారు. వృద్ధాప్యం, శ్వాససంబంధిత సమస్యలతో రాజునాయుడు మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం దొండపూడి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహిస్తామని ఆయన కుమారుడు జిపిఎస్ నాయుడు తెలిపారు

గణపతి ఉత్సవాలకు పందిరి రాట

పందిరి రాట వేస్తున్న గ్రామ పెద్దలు

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని ఉపమాక మెరక వీధి రామాలయం వద్ద గణపతి నవరాత్రి ఉత్సవాలకు గురువారం గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, యువకులు ఆధ్వర్యంలో పందిరి రాట వేసారు .గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ప్రగడ వీరబాబు, శివాలయం చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, సిద్ధాబత్తుల కృష్ణ, కొప్పిశెట్టి రమణ, హరిబాబు, జోగేశ్వరరావు, తోలేటి శ్రీనివాస్, టి.రవి, సత్తిబాబు, నూకబాబు, నాగేశ్వరరావు, మహిళలు పాల్గొన్నారు.

గృహ ప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రోలుగుంట :మండలంలోని కుసర్లపూడి గ్రామ రైనర్లవారి చెరువు డైరెక్టర్ సబ్బవరపు శ్రీనివాసరావు గృహ ప్రవేశానికి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ హాజరయ్యారు. సొసైటీ మాజీ చైర్మన్ చెట్టుపల్లి వెంకటరావు, ఎన్.వెంకన్న, సర్పంచ్ మడ్డు అప్పలనాయుడు పాల్గొన్నారు. సబ్బవరపు శ్రీనివాసరావు గృహప్రవేశానికి అనకాపల్లికి చెందిన వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) తనయుడు సతీష్ హాజరయ్యారు. శ్రీనివాసరావు బంధువులను, కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా పలకరించారు. పిఎ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా యువజన నాయకత్వ శిబిరాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా యువజన నాయకత్వ శిబిరాలు ఏర్పాటు చేస్తామని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు అన్నారు. కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర మొదలుపెట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మూడు నెలలపాటు నాయకత్వ శిక్షణ శిబిరాలు నిర్వహించి పలు రకాల పోటీలు, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. యువత ఐక్యతకు దోహదం చేసేలా ఈ కార్యకలాపాలు ఉంటాయని తెలిపారు. బిజెపి ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఇచ్చి యువతను ఎలా మోసం చేసిందో వివరించారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను మోడీ సర్కారు నిర్వీర్యం చేయడం దారుణమన్నారు. ఎఐసిసి కార్యదర్శి క్రిస్టోఫర్ మాట్లాడుతూ విభజించు - పాలించు మాదిరిగా కేంద్రంలో బిజెపి పాలన సాగుతోందని విమర్శించారు. 2024లో జరగనున్న ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో కాంగ్రెస్ సింగిల్ అజెండా ప్రత్యేక హోదా అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు గొంప గోవిందరాజు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ ముఖద్వారం తొలగించొద్దు

ఆలయ, భక్తుల కమిటీ ఆధ్వర్యాన నిరసన ర్యాలీ, ఆర్‌డిఒకు వినతి

ఆలయ ముఖద్వారం వద్ద నిరసన వ్యక్తంచేస్తున్న భక్తులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : పట్టణంలో మెయిన్‌రోడ్డు విస్తరణలో భాగంగా తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న అయ్యప్పస్వామి దేవాలయం ముఖద్వారాన్ని కూల్చివేత నిర్ణయాన్ని అధికారులు ఉపసంహరించుకోవాలని అయ్యప్ప భక్తులు, దేవాలయ కమిటీ ప్రతినిధులు కోరారు. గురువారం 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయలు రాజేష్ ఆధ్వర్యంలో అయ్యప్ప గుడి వద్ద నిరసన చేపట్టి, తర్వాత ఆర్‌డిఒ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఆర్‌డిఒ జయరామ్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా రాజేష్‌మాట్లాడుతూ నర్సీపట్నం మెయిన్‌రోడ్డులో అబీడ్ సెంటర్ నుంచి బొడ్డేపల్లి వరకూ చేపట్టనున్న రోడ్డు విస్తరణలో అయ్యప్పస్వామి దేవాలయ ముఖద్వారం కొంతభాగం తొలగించేందుకు అధికారులు నిర్ణయించారన్నారు. ముఖద్వారం లోపల దుర్గమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించి, అయ్యప్ప ఆలయానికి వచ్చే భక్తులు ముందుగా ఈ దుర్గమ్మను దర్శించుకోవడం ఆనవాయితీగా సాగుతోందన్నారు. ఈ నేపథ్యంలో విస్తరణలో ఆలయ ముఖద్వారం, దుర్గమ్మను తొలగిస్తే భక్తుల మనోభావాలు దెబ్బతింటాయన్నారు. ఎంతో చారిత్రక, ప్రాధాన్యత కలిగిన అయ్యప్ప దేవాలయ ముఖద్వారం తొలగింపు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు.

దీనిపై ఈ నెల 5న భక్తులు, ఆలయ కమిటీ సభ్యులంతా పార్టీలకు అతీతంగా మున్సిపల్ కమిషనర్ కనకారావును కలిసి విన్నవించామన్నారు. అయితే పైనుంచి ఒత్తిళుల వస్తున్నందున ముఖద్వారం తొలగించక తప్పదన్నట్లు కమిషనర్ దురుసుగా మాట్లాడారని వివరించారు. భక్తుల మనోభీష్టానికి వ్యతిరేకంగా దౌర్జన్యంగా అయ్యప్ప ఆలయ ముఖద్వారాన్ని కూల్చడానికి ప్రయత్నిస్తే, శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమౌతుందన్నారు. అయ్యప్ప భక్తులు, స్థానికుల అభిప్రాయాన్ని గౌరవించాలని వేడుకున్నారు.

'భవిష్యత్ గ్యారెంటీ' పోస్టర్ల ఆవిష్కరణ

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రామానాయుడు, తదితరులు

ప్రజాశక్తి - చీడికాడ : టిడిపి మినీ మేనిఫెస్టోపై విస్తృత ప్రచారం చేయాలని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని కొత్తపల్లిలో బాబుష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ పోస్టర్లను ఆవిష్కరించారు. టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేసే తల్లికి వందనం, మూడు ఉచిత గ్యాస్ సిలెండర్లు, మహిళలకు ఉచిత ప్రయాణం, 18ఏళ్లు నిండిన మహిళలకు ఆర్థికసాయం వంటి పథకాలపై ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పోతల చిన్నం నాయుడు, కార్యదర్శి బొబ్బాది తాతారావు, సర్పంచ్ సూరినాయుడు, ఎంపిటిసిలు బీల కోటి, పైల ముత్యాలనాయుడు, మాజీ సర్పంచ్‌లు పంచాడ దాలినాయుడు, అప్పారావు, కొల్లి పైడం నాయుడు, వైస్ సర్పంచ్‌లు, ధర్మయ్య,నాయుడు, గ్రామ అధ్యక్షులు గణేష్, శివ, చిన అప్పారావు, శ్రీరామమూర్తి, రాజు, చిన్నం నాయుడు, దేముడు నాయుడు, పాత్రిని సురేష్, చెల్లయ్య, కోటి, వెంకటరావు, అప్పలనాయుడు, రాజు, వరాహమూర్తి పాల్గొన్నారు.

అనాథ శరణాలయంలో రాంబాబు జన్మదిన వేడుకలు

అనాథ బాలలకు దుప్పట్లు, బకెట్లు అందజేస్తున్న రాంబాబు

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : వంగవీటి రాధ మిత్రమండలి మండల అధ్యక్షులు, కనకమహాలక్ష్మి దాబా యజమాని తుంపాల రాంబాబు జన్మదిన వేడుకలను ఎలమంచిలి మండలం కొక్కిరపల్లి ప్రేమ సమాజం అనాథ శరణాలయంలో ఘనంగా నిర్వహించారు. శరణాలయంలో వృద్ధులు పిల్లల సమక్షంలో సతీమణి భవానితో కలిసి రాంబాబు కేక్ కట్ చేశారు. అక్కడున్న వృద్ధులకు పిల్లలకు తువ్వాళ్ల, దుప్పట్లు, బకెట్లను ఇవ్వడంతో టిఫిన్, భోజనాన్ని సమకూర్చారు.

మత్స్యకారులు సురక్షితం

సురక్షితంగా ఒడ్డుకు చేరిన మత్స్యకారులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సముద్రంలో ఆపదలో ఉన్న మత్స్యకారులను ఇండియన్ కోస్ట్ గార్డ్ దళం రక్షించింది. వివరాల్లోకి వెళితే.. ఓ ఫిషింగ్ బోట్ గణపతి పెరుమాళ్ ఆధ్వర్యంలో కాసిమేడు నౌకాశ్రయం నుంచి ఆగస్టు 24న చేపల వేటకు బయలుదేరింది. బోట్ మెషినరీ దెబ్బతిన్నప్పటికీ సెప్టెంబర్ 1 నుంచి డ్రిఫ్టింగ్‌ను కొనసాగించింది. కోస్ట్ గార్డ్ నౌకలు విమానం సాయంతో చెన్నయ్ 240 వద్ద బోటును గుర్తించాయి. కోస్ట్ గార్డ్ షిప్ వచ్చే వరకు పడవను పర్యవేక్షించవలసిందిగా ఎంఆర్‌సి చెన్నయ్ సమీపంలోని నౌక ఎంవి జగ్‌రాధను అభ్యర్థించారు. ఈ క్రమంలోనే ఇండియన్ కోస్ట్ గార్డ్ షిప్ ఆయుష్ ఈ నెల 6న అక్కడకు చేరుకుని తొమ్మిది మందిని రక్షించింది. అనంతరం ఆ బోటును విశాఖ మత్స్యశాఖకు అప్పగించింది.

గర్భిణుల ప్రసవాలకు ఆపరేషన్ థియేటర్ ఛార్జీ రాయితీ

డాక్టర్ పుల్లేటికుర్తి మల్లికార్జునరావు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : తన తండ్రి పుల్లేటికుర్తి నారాయణమూర్తి 68వ జయంతి సందర్భంగా ఆపరేషన్ థియేటర్ ఛార్జీ లేకుండా, తమ ఆసుపత్రిలో గర్భిణులకు డెలివరీ చేసే అవకాశాన్ని కల్పిస్తున్నామని పట్టణంలోని ఐదు రోడ్ల జంక్షన్‌లోని ఉమానారాయణ తల్లీపిల్లల ఆసుపత్రి డాక్టర్ మల్లికార్జునరావు తెలిపారు. ఈ సౌకర్యం పొందేందుకు గర్భిణులు తమ పేర్లను ఈనెల 30లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. తన తండ్రి ఆశసాధనలో భాగంగా అత్యున్నతమైన ప్రమాణాలతో ఉమా నారాయణ ఆసుపత్రిని నిర్వహిస్తున్నామన్నారు.తాము కల్పించే సౌకర్యాన్ని నర్సీపట్నం, పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని డాక్టర్ పుల్లేటికుర్తి మల్లికార్జునరావు సూచించారు.

చెత్త బిల్లుల అక్రమాలపై ఫిర్యాదు

ఫిర్యాదు పత్రం అందజేస్తున్న బంగారమ్మపేట ఉపసర్పంచ్

ప్రజాశక్తి -నక్కపల్లి :మండలంలోని బంగారమ్మపేట పంచాయతీలో చెత్త తొలగింపు బిల్లుల్లో అవకతవకలపై విచారణ చేపట్టాలని ఉపసర్పంచ్ చేపల మురళీకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ జ్యోతికి ఫిర్యాదు చేశారు. 2021 మార్చి 12 నుండి 2022 జూన్ 14 వరకు 19 నెలల కాలవ్యవధిలో చెత్త తొలగింపు, పారిశుధ్య పనులకు పంచాయతీ పరిధిలో రూ.4,97,712 బిల్లు చెల్లించారన్నారు. ఈ బిల్లుల్లో పలు అవకతవకలు చోటుచేసుకున్నాయని, ప్రజల సొమ్ము దుర్వినియోగమైందని ఆరోపించారు దీనిపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి, దుర్వినియోగమైన నగదును రికవరీ చేయాలని కోరారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

రాములమ్మకు నివాళులర్పిస్తున్న ఎంపీ ఎంవివి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైసిపి కార్యకర్తల కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటానని విశాఖ ఎంపీ, వైసిపి తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవివి. సత్యనారాయణ పేర్కొన్నారు. జివిఎంసి 22వ వార్డు వైసిపి సీనియర్ కార్యకర్త రాములమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆమె చిత్రపటం వద్ద ఎంవివి గురువారం నివాళ్లర్పించారు. ఆర్థిక సాయం అందించారు.

పలు కార్యక్రమాల్లో బిజీబిజీ

19వ వార్డు పెద జాలరిపేటలో శ్రీ ఒడ్డి పోలమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎంపీ ఎంవివి హాజరయ్యారు. ఆయన వెంట పార్టీ వార్డు ఇన్‌ఛార్జి సూరాడ వెంకట లక్ష్మీదాస్, అధ్యక్షులు వాడమోదుల గణేష్ ఉన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్టీల్ ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్‌ను ఎంవివి పరామర్శించారు. అనంతరం జాలరి ఎండాడ, వాసవానిపాలెంల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు రూ.72 లక్షల ఎంపీ నిధులు మంజూరయ్యాయని గ్రామ పెద్దలకు తెలిపారు.

అణుకు గ్రామం వద్దకు రేషన్

గిరిజనుల పోరాట ఫలితం

అణుకు గిరిజన గ్రామంలో రేషన్ సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-కోటవురట్ల : .గొట్టువాడ శివారు అణుకు అణుకు గిరిజనుల పోరాట ఫలితంగా గ్రామంలో సమస్యలు ఒక్కటొక్కటిగా పరిష్కారమౌతున్నాయి. ఇటీవల కలెక్టర్ రవిసుభాష్ పట్టన్‌శెట్టి గ్రామాన్ని సందర్శించారు. రేషన్ సరుకులను గ్రామానికి తీసుకొచ్చి అందజేయాలని కలెక్టర్ ఆదేశించడంతో, దానికనుగుణంగా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం అణుకు గిరిజన ప్రాంతానికి రేషన్ బియ్యం బండి వచ్చింది. తమ వద్దకు వచ్చి రేషన్ ఇస్తుండడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో గొట్టువాడ గ్రామానికి కాలినడకన వెళ్లి రేషన్ తెచ్చుకునే పరిస్థితి ఉండేదని, తాము చేసిన పోరాటానికి కలెక్టర్ స్పందించి, గ్రామం వద్దకే రేషన్ వాహనాన్ని పంపించి అందజేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీన్ని రెగ్యులర్‌గా కొనసాగించడంతోపాటు మిగతా సమస్యలను పరిష్కరించాలని అణుకు గిరిజనులు కోరుతున్నారు.

రామాలయంలో విద్యాలయం

రామాలయంలో కూర్చుని చదువుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి- చీడికాడ : మండలంలోని వీరభద్రపేట గ్రామంలోని రామాలయం విద్యాలయంగా మారింది. శిథిలావస్థకు చేరుకున్న మండలంలోని వీరభద్రపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం, గడచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పూర్తిగా చిత్తడి మారింది. తరగతి గదిలోకి వర్షపునీరు చిమ్మి లోపల పూర్తిగా తడిగా మారడంతోపాటు శ్లాబు పైకప్పు పెచ్చులూడి కిందకు పడుతుండడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు.దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో విద్యార్థులను గ్రామంలోని రామాలయంలో కూర్చొబెట్టి, అక్కడే పాఠశాలను నిర్వహించి, పాఠాలు బోధించారు. పాఠశాల దుస్థితిపై ఇప్పటికైనా అధికారులు, నేతలు స్పందించి తక్షణ మరమ్మతులు చేపట్టడంతోపాటు శాశ్వత వసతి కల్పన చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయుల తోపాటు విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

మోదమ్మ ఆలయానికి వితరణ



రూ.50 వేలు సాయం అందిస్తున్న టిడిపి నేత పైలా ప్రసాదరావు

ప్రజాశక్తి- చీడికాడ : మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో నిర్మాణంలో మోదకొండమ్మ ఆలయానికి రంగులు వేసేందుకు మాడుగుల నియోజకవర్గ టిడిపి నాయకులు పైలా ప్రసాదరావు రూ.50వేల విరాళాన్ని అందించారు. విరాళమొత్తాన్ని ఆలయకమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా పైలాను ఆలయ కమిటీ ప్రతినిధులు సత్కరించారు. ఈ సందర్భంగా పైలా మాట్లాడుతూ, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలకు తనవంతు సహకారిన్న అందిస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొర్లి గణేష్, పాతాళం ఎర్నాయుడు, ఉప సర్పంచ్ పాతాళం గణేష్, పాతాళం సత్యారావు, సేనాపతి జగ్గారావు, కాకర ముసిలినాయుడు, విస్సారపు దుర్గారావు, పాతాళం శ్రీను, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు రెడ్డి సన్యాసినాయుడు, పేరపు కొండబాబు, రెడ్డి రాము, పేరపు అప్పారావు, జాజిమొగ్గల ప్రసాద్, తాటికొండ దేముడునాయుడు, శరగడం శివ పాల్గొన్నారు.

చురుగ్గా జగనన్న ఇళ్ల నిర్మాణాలు

ప్రజాశక్తి -కోటవురట్ల : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు 85శాతం పురోగతిలో ఉన్నట్లు గృహ నిర్మాణ శాఖ డిఇఇ విజయుడు తెలిపారు. నియోజకవర్గంలో 13,039 ఇళ్లు మంజూరుకాగా, 2667 పూర్తయ్యాయన్నారు మండలాల వారీగా ఎస్.రాయవరంలో 800, నక్కపల్లిలో 619, కోటవురట్లలో 416, పాయకరావుపేటలో 769 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. ,ప్రస్తుతం పునాదుల స్థాయిలో 2513, రూఫ్ లెవెల్ 829, శ్లాబ్ లెవల్ 200 ఉన్నాయని, వాటిని డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామన్నారు. లబ్ధిదారులకు ఇసుక సిమెంట్ ఐరన్ అందిస్తూ, నిర్మాణాల వద్ద సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు.